

క్షౌరవృత్తిలో బంగ్లాదేశీయులను అనుమతించరాదు

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్షౌరవృత్తిలో బంగ్లాదేశీయులు పెరిగిపోయారని, దీంతో ఇదే వృత్తిని నమ్ముకున్నవారి జీవనం దుర్భరంగా మారుతోందని టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రికి ఈమేరకు లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బంగ్లాదేశీయుల సెలూన్లు పెరిగిపోయాయన్నారు. స్థానిక నాయీ బ్రాహ్మణులకు ఉపాధి కరువయ్యిందన్నారు. బంగ్లాదేశీయుల సెలూన్లను అందరూ బహిష్కరించాలన్నారు.

మాయమవుతున్న.. మాల్దండి..!



మాల్దండి రకం జొన్న పంట

ఆరోగ్యకరమైన జొన్న రొట్టెలు

- కనుమరుగవుతున్న మాల్దండి జొన్న
- సంపూర్ణ ఆరోగ్య ఆహారంగా ఈ రొట్టెలకు పేరు
- ఐదేళ్లలో గణనీయంగా తగ్గిన సాగు
- హైబ్రిడ్ రాకతో చరిత్రలో కలిసిపోతున్న వంగడాలు

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కన్నడనాడు విభిన్న ఆహార పద్ధతులకు నెలవుగా ఉంది. మైసూరు, మండ్య ప్రాంతంలో రాగి ముద్ద ప్రధానమైన వంటకంగా ఉంది. తీరప్రాంత జిల్లాల్లో కేరళ సంప్రదాయమైన వంటకాలకు ప్రాధానం ఉంటుంది. రాష్ట్రంలోని ఉత్తర కర్ణాటక పరిధిలోని దాదాపు 10 జిల్లాల్లో జొన్నరొట్టె ప్రధానమైన వంటగా ఉంది. జొన్న, సజ్జ రొట్టెలు ఎక్కువగా వాడుతారు. జొన్న ద్వారా 'కడక్' రొట్టె, సాధారణ రొట్టెలు తయారు చేయడ ఆనవాయితీ. కడక్ రొట్టె అంటే ఒక్కసారి చేసుకుని నిల్వ ఉంచుకుని నెలల తరబడి తినవచ్చు. సాధారణ రొట్టె అప్పటికప్పుడు సిద్ధం చేసుకుంటారు. జొన్నరొట్టె తయారీకి ఎటువంటి నూనె ఉపయోగించరు. ఈ రొట్టె సంపూర్ణ ఆరోగ్యమని ఆ ప్రాంతవాసుల నమ్మకం.

మృదువుగా, రుచికరంగా..

నాణ్యమైన జొన్నరొట్టెలకు మాల్దండి వంగడానికి చెందిన జొన్నను సాగు చేస్తారు. ఈ రకంతో చేసే రొట్టెను తాకితే చాలు మాల్దండి జొన్న పిండితో చేశారని ఉత్తరాదివాసులు గుర్తిస్తారు. మాల్దండి జొన్నపిండితో తయారు చేసే రొట్టె మృదువుగాను, రుచికరంగానూ ఉంటుంది. కడక్ రొట్టె అయితే ఎక్కువరోజులు నిల్వ ఉంటుంది. నిల్వ కాలం పెరిగే కొద్దీ రుచి కూడా అధికమవుతుంది. ఇటీవల హైబ్రీడ్ జొన్న రకాలు కోకొల్లలుగా వచ్చాయి. ఈ రకం సాగులో అధిక దిగుబడి సాధించవచ్చు. అయితే రుచిలో మాల్దండి వంగడానికి తిరుగులేదనే పేరుంది. కానీ వరుసగా కరువు, దిగుబడి తక్కువతోపాటు వివిధ కారణాలతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది.

పశువులకూ ఇష్టమే..

ఈ మాల్దండి రకం జొన్న గడ్డి పశువుల మేతకు సైతం అనుకూలంగా ఉంటుంది. పశువులు కూడా ఇష్టంగానే తింటాయి. సాధారణంగా ఇతర రకాల జొన్న కాండం లావుగా ఉంటుంది. కానీ మాల్దండి రకం జొన్న సన్నగా, పొడవుగా ఉండడంతో పశుగ్రాసానికి వీలుగా ఉంటుంది. ఇది ప్రధానంగా వర్షాధార పంట. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాల్సిన అవసరం ఉండదు. అధిక ప్రొటీన్, ఫైబర్ అంశాలు అత్యధికంగా ఉంటాయి. ఐరన్, పొస్ఫరస్, విటమిన్‌లు పుష్కలంగా ఉంటాయి. సంప్రదాయక వంటకాలకు వీలుంటుంది. జీర్ణక్రియకు ఎంతో దోహదం చేయనుంది. రక్తంలో చక్కెరశాతాన్ని నియంత్రించే ప్రభావం ఉంది.

ఏటా తగ్గిపోతున్న సాగు

ఉత్తరకర్ణాటకలో దశాబ్దాలుగా ప్రధానమైన పంటగా జొన్న ఉండేది. ఆహారంగా తీసుకునేందుకు వీలుండడంతో జొన్నను అధికంగా సాగు చేసేవారు. ఇటీవల కాలంలో గణనీయంగా జొన్న సాగు పడిపోయింది. ఉత్తర కర్ణాటక పరిధిలోని విజయపుర, బాగల్కోట, బెళగావి, గదగ్, బీదర్, బళ్ళారి, ధారవాడ, హావేరి, కలబురగి, కొప్పళ, రాయచూరు, యాదగిరి జిల్లాల్లో తెల్లజొన్నలు ఎక్కువగా పండించేవారు. కొన్నేళ్లక్రిందటిదాకా జొన్నతో చేసే వంటకాలు మినహా ఇతరత్రా వాడేవారు కాదు. మారిన ఆహార పద్ధతి, వ్యవసాయ కూలీల కొరత, ధరల ప్రభావం, జొన్న పంటకు సాంకేతికంగా సాయం అందకపోవడం, జొన్న రొట్టెలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపకపోవడం వంటి కారణాలు పెరిగాయి. ఇలా జొన్నపంట సాగు తగ్గుముఖం పట్టింది. జొన్నలు సాధారణంగా రబీ సీజన్‌లో అధికంగా సాగు చేస్తారు. తక్కువ వర్షపాతం నమోదైనా పంట చేతికొచ్చేది. ఇటీవల కాలంలో ఉత్తర కర్ణాటక ప్రాంతంలోనూ ఖరీఫ్ సీజన్‌లో ఉత్తమ వర్షాలు కురుస్తుండడంతో రెండు మూడు నెలలపాటు పొలాలను బీళ్లు పెట్టుకోకుండా కంది, మినుము, ఇతరత్రా పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు చెరుకు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పత్తి, ఉద్యానపంటలపై అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఇలా పలు కారణాలతో జొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. విజయపుర జిల్లాలో దశాబ్దన్నరకాలం కిందట 4లక్షల హెక్టార్లలో సాగు చేసేవారు. ప్రస్తుతం 85వేల హెక్టార్లకు తగ్గింది.

జాతీయ స్థాయిలో మాల్దండి సాగు

: వ్యవసాయ శాస్త్రవేత్త కరభంటనాళ

మాల్దండి జొన్న జాతీయస్థాయిలో సాగు చేస్తారు. మహారాష్ట్ర, గుజరాత్‌లోనూ ఈ రకం జొన్న సాగు అవుతోంది. అయితే రైతులు విత్తన జొన్నను సంరక్షించడం లేదు. ఇతర వంగడాలు మిశ్రమం అవుతున్నాయి. మాల్దండి జొన్న రకాన్ని ప్రత్యేకంగా సాగు చేసి సంరక్షించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.



సాధారణ జొన్న పంట



మాల్దండి రకం జొన్నలు

ఉత్తర కర్ణాటక జిల్లాల్లో తగ్గుముఖం పడుతున్న సాగు

సంవత్సరం	విస్తీర్ణం (హెక్టార్లు)
2018-19	8,60,596
2019-20	7,13,552
2020-21	6,37,489
2021-22	5,27,598
2024-25	84,545

రూ.40 వేల టిక్కెట్ రూ.8 వేలకే..

- కశ్మీర్ సందర్శనను రద్దు చేసుకుంటున్న పర్యాటకులు
- పహల్గాం ఘటనతో తగ్గిన విమాన టిక్కెట్ ధరలు



బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత కశ్మీర్ వెళ్లేందుకు పర్యాటకులు జంకుతున్నారు. వేసవి సెలవుల్లో సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వెళ్లాలని భావించిన వారు తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. దీంతో విమాన టిక్కెట్ ధరలు అమాంతం పడిపోయాయి. బెంగళూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ట్రావెల్ ఏజెన్సీలు ప్యాకేజీలు ప్రకటించి, విమానం టిక్కెట్లను రిజర్వు చేయించాయి. ఏప్రిల్ మూడో వారం నుంచి మే చివరిదాకా ఇలా రిజర్వు చేసుకున్న టిక్కెట్‌లు రద్దు అవుతున్నాయి. దీంతో వారం క్రితం రూ.40వేలు పలికిన విమాన టిక్కెట్ ధర ఇప్పుడు రూ.8వేలకు పడిపోయింది. బెంగళూరు నుంచి జమ్ము, కశ్మీర్‌కు రూ.30-40వేలు టిక్కెట్ ధర ఉండేది. ఇప్పుడు రూ.8-9వేలకు దిగొచ్చింది. బెంగళూరు నుంచి శ్రీనగర్‌కు వెళ్లే విమాన సర్వీసులను రద్దు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. కశ్మీర్ పర్యటన రద్దు చేసుకుంటున్నామని, టిక్కెట్లను క్యాన్సిల్ చేయాలని పర్యాటకులు ఏజెన్సీలను కోరుతున్నారు. కొన్ని ఏజెన్సీలు కోతలు పెట్టి రీఫండ్ చేస్తున్నాయి. ప్యాకేజీల ప్రకారం బుకింగ్ చేశామని, విమానం, హోటళ్లు, లోకల్ పర్యటనలకు వాహనాలు బుక్ చేశామని, ఇప్పుడు రద్దు చేసుకుంటే ఎక్కువ కోత విధించాల్సి వస్తుందని కొన్ని ఏజెన్సీలు చెబుతున్నట్లు సమాచారం. కశ్మీర్‌వైపు మరికొన్ని నెలలపాటు పర్యాటకులు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ప్రభావంతో హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, అస్సాం, గోవా, అండమాన్ వెళ్లేవారి సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది.

శిథిలావస్థలో తరగతి గదులు



చేళూరులోని పాఠశాల భవనం

చేళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులోనూ, తాలూకా పరిధిలోని పులగల్లు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయి. పులగల్లులోని తరగతి గది ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా దెబ్బతింది. కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంతో భయం భయంగా విద్యార్థులు చదువుకుంటున్నారు. మరోవైపు చేళూరులోని ప్రాథమిక పాఠశాల కూడా శిధిలావస్థకు చేరింది. తాలూకాలో పలు చోట్ల ప్రభుత్వ తరగతి గదులు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. పైకప్పు లేదా గోడలు కూలి ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితి తలెత్తకుముందే వీటిని బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే తరగతి గదులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పులగల్లులోని పాఠశాల ప్రహరీ

సతాయిస్తున్న సర్వర్..!

- జొన్న కొనుగోలు కేంద్రం వద్ద గంటల కొద్దీ ఎదురుచూపు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీఎంసీ జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు కష్టాలు తప్పడం లేదు. సర్వర్ సమస్యతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పల్లెవాసులు వాపోతున్నారు. పలు గ్రామాల నుంచి దాదాపుగా 300 నుంచి 400 మంది రైతులు వరకు సోమవారం ఉదయం ఏపీఎంసీ మార్కెట్ సమీపంలోని జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్‌ను కోసం వచ్చారు. సర్వర్ సమస్యతో సాయంత్రం 4 గంటలైనా రిజిస్ట్రేషన్ ప్రారంభం కాలేదు. ఎండలో గంటల కొద్దీ వేచి ఉన్నామని, కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదని రైతులు మండిపడ్డారు.



చెట్ల కింద వేచివున్న రైతులు



బెళగావిలో వేదికపై వంటగ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీఎం, డీసీఎం తదితరులు

అబద్ధాల కేంద్రం..!

- ప్రజలను మభ్యపెట్టి నిత్యావసరాల ధరలు పెంచేశారు
- బీజేపీ నాయకులపై ముఖ్యమంత్రి మండిపాటు
- నిత్యావసరాల ధరల పెంపుపై బెళగావిలో ఆందోళన

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రజలను అబద్ధాల ప్రవాహంలో ముంచి నిత్యావసర ధరలను పెంచిందని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. సోమవారం ఏఐసీసీ ఆధ్వర్యంలో బెళగావిలో నిత్యావసరాల ధరల పెంపునకు నిరసనగా ఆందోళన చేశారు. డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, మంత్రులు సతీశ్ జార్కిహాళి, హెచ్‌కే పాటిల్, మునియప్ప, మహదేవప్ప, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తోపాటు వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బియ్యం, వంటనూనె, బంగారం, వెండి, రసాయన ఎరువులు, దినుసులు, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్‌తోపాటు అన్ని రకాల ధరలు పెంచేశారన్నారు. బీజేపీ దేశ వ్యతిరేక పాలన ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. గడిచిన పదేళ్లలో నిరంతరంగా ధరలు పెరుగుతున్నాయన్నారు. దేశంలో చిన్న, మధ్య తరగతి ప్రజల జీవన విధానం కష్టతరంగా మారిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు ఉందన్నారు. కశ్మీర్‌లో అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చారని, ఇది కేంద్రం వైఫల్యం కాదా..? అని ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా 50ఏళ్లపాటు ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో జాతీయజెండా ఎగురలేదని ఇంతకంటే సిగ్గుచేటు చర్య ఉంటుందా.? అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల భాగస్వామ్యం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలధర లీటరుకు రూ.4 పెంచి నేరుగా రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ ధరల పెంపునుంచి సామాన్యుడికి రక్షణగా ఉండాలనే రాష్ట్రంలో గ్యారంటీలు అమలు చేస్తున్నామని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. మన్మోహన్‌సింగ్ కాలంలో రూ.28వేలు ఉన్న బంగారం ప్రస్తుతం రూ.లక్షకు పెరిగిందని, రూ.43వేలు పలికిన వెండి రూ.94వేలకు పెరిగిందన్నారు. ప్రతి వస్తువుపైనా రెండుమూడింతలు ధరలు పెరిగాయన్నారు. బెళగావిలో ఆందోళన వేళ బీజేపీ కార్యకర్తలు నల్లజెండాలతో నిరసనపై తీవ్రంగా స్పందించారు. బీజేపీ ఇదే విధానం కొనసాగిస్తే భవిష్యత్తులో ఎక్కడా ఆందోళన చేసేందుకు అవకాశం ఉండదని హెచ్చరించారు. రాష్ట్ర కాంగ్రెస్ తరపున ప్రధానమంత్రికి నిత్యావసరల ధరల పెంపుపై ప్రత్యేక వినతిపత్రాన్ని పంపారు. ఆందోళనకు ముందు ఉగ్రవాదుల దాడిలో బలైన ముగ్గురు కర్ణాటక ప్రజల చిత్రపటాలకు పూలు చల్లి నివాళులు అర్పించారు.

ఏఎస్పీపై మండిపడ్డ సీఎం

బెళగావి సభలో సీఎం సిద్దరామయ్య ఏఎస్పీ నారాయణ భరమనిపై మండిపడ్డారు. సభా వేదికపైనే ఏయ్... అంటూ ఏకవచనంతో దూషించారు. ఇది సర్వత్రా విమర్శలకు కారణమైంది. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ ఇలా వ్యవహరించడం సరికాదని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి గౌరవాన్ని కాపాడుకోవాలని ప్రతిపక్షనేత అశోక్ సూచించారు. వేదికపైనే పోలీసు అధికారిని మందలించడం సరికాదన్నారు. పోలీసులు రక్షణ, శాంతిభద్రతల విషయంలో అహర్నిశలు పనిచేసేవారిపై దురుసుగా వ్యవహరించడం మానుకోవాలన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

హరిహరులను దర్శించుకుని..!

- తిరిగి వెళుతుండగా పాకాల వద్ద రోడ్డు ప్రమాదం
- కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురి దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు
- నలుగురు మహిళలు బెంగళూరువాసులు

పట్టణాల్లో ట్రాఫిక్ మార్గాలు దాటుకుని జాతీయ రహదారి ఎక్కగానే ఎక్సలేటర్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు లేకపోవడంతో రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. పైగా ఆరు వరుసల జాతీయ రహదారి కావడంతో వేగానికి కళ్లెం వేయడంలేదు. ఇలాంటి అతివేగం వల్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు.

8

నోటికాడి పంట నీటి పాలు

- అన్నదాతపై ప్రకృతి ప్రకోపం
- అకాల వర్షాలతో నీట మునిగిన వరి ధాన్యం
- ఉమ్మడి బళ్లారి జిల్లాలో రూ.కోట్లలో నష్టం

బళ్లారి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట నీట మునిగింది. నోటికాడి పంట వర్షార్పణం కావడంతో రైతులకు ఆవేదనే మిగిలింది. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఉభయ జిల్లా రైతులకు నిద్ర లేకుండా పోయింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం నీట మునిగింది. మరి కొన్ని ప్రాంతాల్లో మూటల్లో వేసిన ధాన్యం కూడా తడిసిపోయింది. అకాల వానలతో రైతులు రూ. కోట్లల్లో నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు. ఆదివారం రాత్రి బళ్లారి జిల్లా సిరుగుప్ప, రాయచూరు, జిల్లాలో ఎడతెరపి లేకుండా వానలు కురిసాయి. వీటితో పాటు బలమైన ఈదురు గాలులు వీచాయి. రైతులు ధాన్యం కోసి రోడ్డపైన, కల్లాల్లో ఆరబోసుకున్నారు. రోడ్డపైన వేసుకున్న ధాన్యం కురిసిన వానకు వంకలు పొంగిపోర్లాయి. దీంతో పలు ప్రాంతాల్లో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. అతివృష్టి లేదా అనావృష్టిలకు ప్రతి సారి నష్టపోతున్నామని రైతులు వాపోయారు. సిరుగుప్ప తాలూకాలో భారీ నష్టం వాటిల్లింది. సిరుగుప్ప తాలూకా బూదిగుప్ప గ్రామానికి చెందిన మస్తాన్ వలి అనే రైతుకు చెందిన ఎద్దులు మృత్యువాత పడ్డాయి. పొలంలో ఎద్దులు కట్టేసి ఉండగా ఈదురు గాలులకు చెట్టు కూలి ఎద్దులు మృతి చెందాయి. చెట్టు కూలిపోవడంతో దాంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా అయి ఎద్దులు మృత్యువాత పడినట్లు జెస్కాం అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వానకు ధాన్యం అంతా నీటిపాలు అయిందని కురుగోడు గ్రామానికి చెందిన రైతు మంజప్పగౌడ ఆవేదన వ్యక్తం చేశారు. అకాలంగా కురిసిన వానకు వంకలు వాగులు పొర్లి పొంగడంతో పెద్ద మొత్తంలో ధాన్యం నీటిపాలు అయ్యిందని రైతులు తెలిపారు. అసలే ధరలు లేక ధాన్యం కొనేవారే కరువయ్యారని, ఇక తడిసిన ధాన్యం ఎవరు కొంటారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిశీలించి, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.



మృతిచెందిన ఎద్దులు





సిరుగుప్ప తాలూకా బూదిగుప్ప వద్ద నీటిలో మునిగిన వరి రాశులు

వేతన పోరు..!

- తాగునీటి కార్మికుల వేతన వెతలు
- 24 రోజులుగా కొనసాగుతున్న సమ్మె
- పట్టించుకోని అధికారులు



ఎస్ఈ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేతనం అందాలంటే సమ్మె చేయాల్సిందే అన్న చందంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి తయారైంది. ఐదు నెలలుగా వేతనాలు అందట్లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లెక్కలేని తనంతో కార్మికులకు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండ మండలాల్లోని 727 గ్రామాలకు పీఏబీఆర్ నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పథకంలో 588 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి 5 నెలల వేతనాలు పెండింగ్ ఉండటంతోపాటు ఈపీఎఫ్ జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో పలుమార్లు కార్మికులు సమ్మెబాట పట్టినా అధికారులు కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఒకట్రెండు నెలల వేతనం జమ చేసి, సమ్మె విరమించేలా చేస్తూ వస్తున్నారు. కార్మికులు ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో నీరు సరఫరాకాక అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతానికి స్థానికంగా ఉన్న వనరుల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఇకపై ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు సంబంధించి టెండరు గడువు ముగియడంతో వేతనాల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాత కాంట్రాక్టర్ ద్వారా చెల్లిద్దామన్నా.. నిధుల కొరత ఉంది. టెండరు పూర్తి చేసి బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

-సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కోటలోని మొనగాడు..!

తెలంగాణ సీఎస్‌గా గుత్తివాసి రామకృష్ణారావు

- తాత చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్య సమరయోధుడు
- తండ్రి రైల్వే ఉద్యోగి.. హైదరాబాద్‌లో స్థిరపడిన కుటుంబం



తెలంగాణ సీఎం అభినందనలు



రామకృష్ణారావు కుటుంబం నివసించిన ఇల్లు ఇక్కడే ఉండేది.. కొన్నవారు ఇలా పునర్నిర్మించారు

గుత్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గుత్తి కోట వీధిలో ఒకప్పుడు ఓనమాలు దిద్దిన కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. వీరిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. గుత్తి పట్టణంలోని కోట ప్రాంతంలో వీరి కుటుంబం ఉండేది. రామకృష్ణారావు తాత(తండ్రికి తండ్రి) కూట్లిగి చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తల్లిదండ్రులు గురునాథరావు, భాగ్యలక్ష్మి దంపతులు. గురునాథరావు రైల్వే ఉద్యోగి కావడంతో బదిలీలపై వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. చివరకు హైదరాబాదులో స్థిరపడ్డారు.

గుత్తి నుంచే ప్రస్థానం..

రామకృష్ణారావు గుత్తి కోట వీధిలోని పట్టు కేశవపిళ్లై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివారు. శ్రీసత్యసాయి జిల్లా (ఉమ్మడి అనంతపురం జిల్లా) పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివారు. నాగార్జున సాగర్‌లో ఇంటర్, కాన్పూర్ ఐఐటీలో బీటెక్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, డ్యూక్ యూనివర్శిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. 1991లో ఐఏఎస్ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామబాద్ జిల్లాల సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు, అదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌గా, విద్యాశాఖ కమిషనర్‌గా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహించారు.



గుత్తిలో స్నేహితులతో రామకృష్ణారావు దంపతులు (ఫైల్)

జ్ఞాపకాలే మిగిలాయి..

గుత్తి కోట వీధిలో రామకృష్ణారావు కుటుంబానికి సొంత ఇల్లు ఉండేది. ఇదే మండలంలోని కొత్తపేట గ్రామ పరిధిలో భూములు ఉండేవి. ఇంటిని అమ్మేశారు. భూములను కూడా విక్రయించారని తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ వారికి బంధువులు ఎవరూ లేరు. ప్రాథమిక పాఠశాలలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు నాగరాజు, సికిందర్ తదితరులు ఉన్నారు. 2014లో కుటుంబ సమేతంగా రామకృష్ణారావు గుత్తికి వచ్చారు. తాను చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపారు. స్నేహితులను కలిశారు. ఆ తరువాత గుత్తికి మరో మారు రాలేదని ఆయన స్నేహితులు తెలిపారు.



గుత్తి కోటవీధిలో రామకృష్ణారావు చదువుకున్న పాఠశాల

గర్వంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ సీఎస్ కావడం గర్వంగా ఉంది. మేము ఐదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం. చిన్నప్పుడే విడిపోయినా స్నేహాన్ని కొనసాగిస్తున్నాం.

-నాగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం జిల్లా సహకార శాఖ అధికారి

ఆనందంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ రాష్ట్రానికి సీఎస్ కావడం ఆనందంగా ఉంది. ఆయన కుటుంబసమేతంగా గుత్తికి వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చారు. మేము చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపాము. చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నాము. - సిఖందర్, స్నేహితుడు

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, టర్నర్, మెషినిస్ట్, మోటార్ మెకానిక్, కోపా తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగది ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 24వ తేదీలోపు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఏప్రిల్‌లో నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాల కోసం కళాశాలలోని అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈలు ప్రొఫెసర్ మాధవి, డాక్టర్ లలితకుమారి, విభాగాధిపతులు కళ్యాణిరాధ, మమత, అజిత, జరీనా, నారాయణరెడ్డి, రామశేఖర్ రెడ్డి, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపే పాలిసెట్

37 కేంద్రాలు..

14,205 మంది విద్యార్థులు..

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాలిసెట్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,205 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పాలిసెట్ నిర్వాహక కన్వీనర్లు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. అనంతపురంలో 9, తాడిపత్రిలో 6, గుంతకల్లులో 4, కళ్యాణదుర్గంలో 3, కదిరి, ధర్మవరం, హిందూపురంలో 5 చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో 37 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయనీ, గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాల్‌టిక్కెట్ రానివారు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బీఈడీ పరీక్షల్లో

నలుగురు డిబార్

పలు తేదీల్లో పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షల్లో సోమవారం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తనఖీ చేసి, మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వారిని డిబార్ చేశామన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో, మే 7న నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు.

పాలిసెట్, ఐసెట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని జూన్ 2, 3, 4 తేదీల్లో తిరిగి నిర్వహిస్తామనీ, విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ఆశాజనకంగా మార్కెట్ ఫీజు వసూళ్లు

మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి



అనంతపురంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుల్లో ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉందని జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 96.75 శాతం మార్కెట్ ఫీజు వసూళ్ల రాబట్టినట్లు తెలిపారు. లక్ష్యాలు, వసూళ్ల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: గత ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యమెంత..? ఎంత వసూలైంది..?

ఏడీ: 2024-25 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ జిల్లాకు రూ.12.06 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. రూ.11.66 కోట్లు వసూళ్ల రాబట్టి.. 96.75 శాతం నమోదు చేశాం. అంతకు ముందు ఏడాదితో పోల్చితే..రూ.35లక్షలు ఎక్కువగానే వసూళ్ల చేశాం.

ఆంధ్రజ్యోతి: వందశాతం పూర్తి చేసిన మార్కెట్ కమిటీలు ఉన్నాయా..?

ఇంటర్వ్యూ interview

ఏడీ: జిల్లాలోని తొమ్మిది మార్కెట్ యార్డుల్లో.. ఐదు కమిటీలు వంద శాతం లక్ష్యాలను పూర్తి చేశాయి. రాయదుర్గం మొదటి స్థానంలో ఉంది. రూ.1.44 కోట్లకు గాను.. రూ.1.61 కోట్లు వసూలు చేశారు. కళ్యాణదుర్గం రూ.61 లక్షలకు గాను రూ.64.16లక్షలు, శింగనమల రూ.1.02కోట్లకు.. రూ.1.05 కోట్లు, తాడిపత్రి రూ.2.02 కోట్లకు రూ.2.08 కోట్లు, గుంతకల్లు రూ.65 లక్షలకు రూ.66.04 లక్షలు వసూలయింది. అనంతపురం రూ.4.60 కోట్లకు.. రూ.4.34 కోట్లు వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి: వంద శాతం ఫీజు వసూలు కాకపోవడానికి కారణాలేమిటి..?

ఏడీ: గత ఆర్థిక సంవత్సరం అకాల వర్షాలతో పంట దిగుబడులు బాగా తగ్గిపోయాయి. ఎండు మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. దీంతో కొనుగోలు తగ్గిపోయాయి. కంది, వరి తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసింది. వేరుశనగ దిగుబడలు తగ్గాయి. వీటి ప్రభావం ఫీజు వసూళ్లపై పడింది.

ఆంధ్రజ్యోతి: ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను నిర్దేశించారా.. ఒక్కో కమిటీకి ఎంత..?

ఏడీ: ఇటీవల మార్కెటింగ్ శాఖ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు రూ.13.49 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతపురం మార్కెట్ కమిటీకి రూ.5.10 కోట్లు, గుత్తికి రూ.25 లక్షలు, గుంతకల్లు రూ.73 లక్షలు, కళ్యాణదుర్గం రూ.70 లక్షలు, రాప్తాడు రూ.50 లక్షలు, రాయదుర్గం రూ.1.76 కోట్లు, శింగనమల రూ.1.20 కోట్లు, తాడిపత్రి రూ.2.35 కోట్లు, ఉరవకొండకు రూ.90 లక్షలు మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలను ఇచ్చారు.

అటవీశాఖలో నోటీసుల కలకలం..!

చలానా సొమ్ము స్వాహాపై రికవరీకి ఆదేశాలు

- ఉద్యోగ విమరణ వేళ.. నోడ్యూస్ తిరకాసు
- తప్పుచేసిన వారితోనే నివేదిక తయారీ
- ప్రస్తుత సూపరింటెండెంట్‌కూ భాగస్వామ్యం
- ఇదెక్కడి న్యాయమంటూ సిబ్బంది గగ్గోలు



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో కలకలం రేగుతోంది. శని, ఆదివారాల్లో పలువురికి షోకాజ్ నోటీసులు పంపడంతో ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అనంతపురం రేంజ్‌కు సంబంధించి నకిలీ చలనాల రూపంలో దారి మళ్లిన సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు వింతధోరణి అవలంబిస్తున్నారు. అక్రమార్కుడు అనంతపురం రేంజ్‌కే పరిమితం కాకుండా.. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ పని చేస్తే అక్కడ నకిలీ చలానాల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన సొమ్మును దారి మళ్లించి జేబు నింపుకున్నాడని తెలుస్తోంది. ఎక్కడెక్కడ ఎంత నొక్కేశాడనేది బీట్‌ల వారిగా లెక్కలు తేల్చారు. సంబంధిత సిబ్బంది ద్వారా రికవరీ చేసేందుకు యంత్రాంగం చర్యలకు సిద్ధమయింది. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదంతా చేస్తున్నది అందులో భాగస్వాములైన అప్పటి అకౌంటెంట్ కావడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. అక్రమాలు జరిగిన సమయంలో కొన్ని రోజులు సూపరింటెండెంట్లుగా రవికుమార్, షాహనవాజ్ ఉన్నారు. పని ఒత్తిడి కారణంగా అప్పట్లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రమేష్‌కు అకౌంట్స్ విభాగం బాధ్యతలు అప్పగించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎలాంటి రికార్డులు చూపకపోవడంతో.. బాధ్యుడు రమేష్ అయినా రికార్డుల ప్రకారం ఉన్నవారిపై చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఉద్యోగ విరమణ వేళ.. నోడ్యూస్ తిరకాసు

అక్రమాల్లో భాగస్వాములయిన ఉద్యోగ విరమణ పొందే వారికి నోడ్యూస్ ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో ప్రధానంగా ఐజాక్‌బాబు ముదిగుబ్బ ఎఫ్ఎస్ఓగా ఉన్నారు. ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన ఎఫ్ఎస్ఓగా గుత్తిరేంజ్‌లో పని చేసిన సమయంలో బీట్ ఆఫీసర్ అయూబ్ బాషాకు సంబంధించిన చలానాలు సైతం నకిలీలుగా తేలాయి. ఇప్పటికే అయూబ్ బాషా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ఇచ్చారు. ఎఫ్ఎస్ఓ ఐజాక్‌బాబు ఉద్యోగ విరమణ సమయంలో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి.. ప్రస్తుతం కుప్పం డీఆర్వోగా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్‌గా ఉన్న శ్రీనివాసులు జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇవ్వడానికి అడ్డంకిగా మారింది. డీఆర్వోగా వెళ్లిన రామకోటి అప్పుడు జరిగిన అక్రమాల్లో తమ పాత్ర ఏమీ లేనప్పటికి బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనున్న అప్పటి రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం డోన్ సబ్ డీఎఫ్ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు.

మొద్దు నిద్రలో అకౌంట్స్ విభాగం

ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటుంటే.. అకౌంట్స్ విభాగం ఏమి చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ప్రస్తుత సూపరింటెండెంట్ గా ఉన్న అప్పటి సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్‌గా అకౌంట్స్ విభాగం బాధ్యతలు నిర్వహించారు. అకౌంట్స్ విభాగంలో మరో కాంట్రాక్ట్ వర్కర్ కీలకం కావడంతో తప్పిదాలు వెలుగులోకి వచ్చినప్పటికి తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం. 2019 నుంచి 2023 వరకు ఈ తంతు జరుగుతున్నా ఏ ఒక్కటీ బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటే ఈ కార్యాలయంలో కాంట్రాక్ట్ వర్కర్ల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. జిల్లా అధికారి వద్దకు పంపే ముందు అకౌంట్స్ అధికారి, సూపరింటెండెంట్ పరిశీలిస్తారు. అసలు వీరు ఏమి చేశారన్నది ప్రశ్నార్థకరంగా మారింది. అనంతపురం రేంజ్‌లో ఏకంగా 173 నకిలీ చలానాలతో రూ.11,72,158, గుత్తిలో 34 నకిలీ చలానాలతో రూ.2,73,225 సొమ్ము పక్కదాని పట్టినట్లు సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి

ఉమ్మడి జిల్లాలో నకిలీ చలానాల రూపంలో కాంట్రాక్ట్ కార్మికుడి చేతిలో మోసపోయిన సిబ్బంది పరిస్థితి ఇటు నుయ్యి, అటు గొయ్యి అన్న చందంగా మారింది. అధికారుల తీరు చూస్తుంటే.. ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి తెచ్చి రికవరీకి చర్యలు చేపట్టేలా నోటీసులు జారీ చేశారు. అసలైన అక్రమార్కుడి నుంచి రికవరీకి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పోలీసుల నుంచి నిందితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన వివరాలు సైతం తెప్పించారు. అందులో కూడా అక్రమాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది.

రికవరీ చేస్తే తప్పు ఒప్పుకున్నట్లే...

ఉమ్మడి జిల్లాలోని 10 మంది రేంజర్లకు, శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, గుత్తి రేంజ్‌లోని 12 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, అనంతపురం రేంజ్‌లోని ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు ఐదుగురు ఎఫ్‌బీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కొందరు రాబోయే రెండు, మూడు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీనికి తోడు నోడ్యూస్ ఇవ్వకుండా పెండింగ్ పెడుతుండటంతో తక్కువ సొమ్ము రికవరీ చేయాల్సి ఉండటంతో కొందరు ఆ మొత్తాలను చెల్లించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలా సొమ్ము చెల్లిస్తే తప్పు అంగీకరించినట్లవుతుంది. అలా చేస్తే.. మీపై ఎందుకు చర్యలు చేపట్టకూడదని రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేస్తే పరిస్థితి ఏమిటనే మీమాంసలో పడ్డారు. కీలకమైన ఆర్థిక లావాదేవీలు ఉన్న స్థానంలో కాంట్రాక్ట్ వర్కర్స్‌ను నియమించడంతో ఈ సమస్య ఉత్పన్నమయిందని ఆ శాఖ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరిగినా ఆ స్థానాల్లో తిరిగి కాంట్రాక్ట్ వర్కర్స్‌నే కొనసాగిస్తున్నారు. షోకాజ్ నోటీసులపై యూనియన్ తరఫున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు.

ప్రజల సొమ్మును దుర్వినియోగం కానివ్వం



అక్రమంగా దారి మళ్లిన సొమ్ము ప్రజల నుంచి వసూలు చేసింది. ఆ సొమ్ము అన్యాక్రాంతం కావడానికి వీలు లేదు. అందులో భాగస్వాములయిన సిబ్బంది ఉద్యోగ విరమణ పొందితే కొన్ని ఇబ్బందులు తలేత్తే అవకాశం ఉంది. దీంతో వారు ఉద్యోగంలో ఉన్నట్లుగానే సమస్యను మరింత వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగానే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

-విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి

పైసలకొద్దీ.. పర్సెంటేజీ..!

పాయింట్ల కోసం టీచర్ల అడ్డదారులు

- మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలనలో మాయలు
- బోగస్ చెవుడు సర్టిఫికెట్లతో లబ్ధి
- ఇతర ఉపాధ్యాయుల విస్మయం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- రీవెరిఫికేషన్‌కు సమాలోచనలు
- అక్రమార్కుల్లో ఆందోళన



అనంతపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ప్రిఫరెన్షియల్ పాయింట్లు పెట్టుకుని కోరుకున్న పాఠశాలలకు వెళ్లడానికి కొందరు టీచర్లు చెవుడు మాస్టార్ల అవతారమెత్తారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్లకోసం ప్రభుత్వం స్థానిక జిల్లా సర్వజనాస్పత్రిలో ప్రత్యేక పరిశీలన నిర్వహించింది. విద్యాశాఖ బదిలీల నిబంధనల మేరకు 40 శాతం అంగవైకల్యం ఉంటే 5 పాయింట్లు, 56శాతంపైగా ఉంటే 10, 70శాతం పైన ఉంటే ప్రిఫరెన్షియల్ కింద ముందువరుసలో ఉంచి బదిలీల్లో అవకాశం కల్పిస్తారు. దీంతో టీచర్లు ప్రిఫరెన్షియల్ పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కారు. చెవుడు లేకున్నా.. ఉన్నట్లు సర్టిఫికెట్లు పొందారు. ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఒకరిద్దరు దళారీల ద్వారా ఆమ్యామ్యాలు అప్పగించి డాక్టర్లను మేనేజ్ చేసి చెవుడు లేకున్నా ఉన్నట్లు పర్సెంటేజీ వేసి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకాలం చెవుడులేకుండా వారు ఉద్యోగాలు చేశారు. ఇపుడు తమకు చెవుడు ఉందని వందమంది వరకు టీచర్లు సర్టిఫికెట్లు పొందడంపై ఇతర ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఓ స్కూల్ అసిస్టెంట్ ఏకంగా 70 శాతంపైగా చెవుడు ఉందని సర్టిఫికెట్ పొందారట. అనంతపురం రూరల్, శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాప్తాడు, హిందూపురం, ధర్మవరం నియోజకవర్గాల్లో కూడా టీచర్లు ఇలాగే చెవిటి సర్టిఫికెట్ పొందారట. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు టీచర్లు జట్టుగా ఏర్పడి ఇలా బోగస్ చెవిటి సర్టిఫికెట్లు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యవర్గాలు చెబుతున్న మేరకు 70 నుంచి 80శాతంపైగా చెవుడు ఉంటే వారికి మాటలు కూడా రావట. ఇక్కడ మాత్రం చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లు ఏనాడూ చెవిటి మిషన్ కూడా వాడలేదట. దర్జాగా అందరితో కలిసి తిరిగారు. ఇపుడు మాత్రం 70 నుంచి 80 శాతం చెవుడు ఉందని సర్టిఫికెట్లు పొందడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఇద్దరి పాత్రపై అనుమానాలు

నకిలీ చెవుడు సర్టిఫికెట్ల జారీలో జిల్లా ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారు ఆ విభాగ డాక్టర్లతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారట. ఈ నేపథ్యంలో టీచర్ల మెడికల్ సర్టిఫికెట్ల జారీలో ఆ ఇద్దరు డబ్బు సంపాదించాలని అక్రమమార్గంలో సర్టిఫికెట్ల జారీకి ప్లాన్ వేసినట్లు చెప్పుకుంటున్నారు. అప్పటికే పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కుతున్న కొందరు టీచర్లు వారిని కలిసినట్లు తెలుస్తోంది. పాయింట్లవారీగా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఒక్కొక్కరు చెల్లించేలా ఒప్పందం చేసుకుని, పరీక్షలు చేయకుండానే ఇంత శాతం చెవుడు ఉందని డాక్టర్లకు చెప్పడం, సర్టిఫికెట్లపై సంతకాలు చేయించడం చకచకా జరిగిపోయాయని టీచర్లతోపాటు ఆస్పత్రిలో వైద్యసిబ్బంది బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

బోగస్ సర్టిఫికెట్ల జారీపై రాష్ట్ర ఉన్నతాధికారులకు కొందరు టీచర్లు ఫిర్యాదులు చేసినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. అక్రమ మార్గంలో పొందిన చెవుడు సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలనే ఆలోచనలో రాష్ట్ర అధికారులు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇలాగే కొందరు బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో చెవుడు సర్టిఫికెట్లు పెట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అపుడు హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి రెఫర్‌చేసి రీవెరిఫికేషన్ చేయించారని టీచర్లు అంటున్నారు. కొందరు ఇలాంటి చెవుడు సర్టిఫికెట్లు పెట్టి డీఎస్సీలో ఉద్యోగాలు పొందాలనే ఆరోపణలు రావడంతో అప్పుడు కూడా రీవెరిఫికేషన్ చేయించగా.. బోగస్ అని తేలడంతో పోస్టులు ఇవ్వలేదంటున్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని చూస్తున్నా.. ఇంకా కొందరు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లతో అక్రమంగా పాయింట్లు పొంది కోరుకున్న పాఠశాలలకు వెళ్లాలని అడ్డదారులు తొక్కడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో నష్టపోయే ఉపాధ్యాయులు కొందరు ఇదే విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెడికల్ క్యాంపులో చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లకు రీవెరిఫికేషన్ పెట్టాలనీ, అందులో బోగస్ అని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం బోగస్ చెవుడు సర్టిఫికెట్ల వ్యవహారం వాటిని పొందిన టీచర్లతోపాటు జారీచేసిన డాక్టర్లలో సైతం ఆందోళన రేపుతోంది.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

రాజా రవివర్మ (జయంతి)



భారతీయ చిత్రకళ చరిత్రలో గొప్ప చిత్రకారుడిగా గుర్తింపు పొందిన రాజా రవివర్మ 1848 ఏప్రిల్ 29న కేరళ రాష్ట్రం కిల మానూర్‌లో జన్మించారు. తైల వర్ణ చిత్రకళను బ్రిటీష్ దేశస్థుడైన థియోడార్ జెన్సన్ వద్ద నేర్చుకున్నారు. రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను చిత్రాలుగా మలచి గుర్తింపు పొందారు. భారతీయ సాంప్రదాయిక, పాశ్చాత్య చిత్రకళ మెళకువల సంగమానికి ఆయన చిత్రాలు చక్కని మచ్చుతునకలు. చీర కటుకున్న స్త్రీలను అందంగా, చక్కని వంపు సొంపు లతో చిత్రించడంలో ఆయనకు ఆయనే సాటి. 1873లో వియన్నా కళాప్రదర్శనలో మొదటి బహుమతి దక్కించుకుని ప్రపంచవ్యాప్తంగా పేరొందారు. 1906 అక్టోబరు 2న కన్నుమూశారు.

ఖురేషి అల్లారఖా ఖాన్ (జయంతి)



ఖురేషి అల్లా రఖాఖాన్ 1919 ఏప్రిల్ 29న కాశ్మీర్‌లోని ఫగ్వాల్‌లో జన్మించారు. భారతీయ తబలా కళాకారుడు. సితార్ విద్వాంసుడు రవిశంకర్‌కు ఎక్కువసార్లు వాద్యసహకారం అందించారు. ఈయన కొడుకు జాకీర్ హుసేన్ కూడా ప్రముఖ తబలా విద్వాంసుడే. ఈయన మాతృభాష డోగ్రీ. ముంబైలో ఆలిండియా రేడియోలో స్టాఫర్‌గా పని చేశారు. 1943-48లమధ్య రెండు మూడు హిందీ సినిమాలకు సంగీతం అందించారు. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతానికి మధ్య అంతరం పూరించారు. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు ఇతర అవార్డులు అందుకున్నారు. 2000 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

జుబిన్ మెహతా (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్ గ్రహీత జుబిన్ మెహతా 1936 ఏప్రిల్ 29న బాంబేలో పార్సీ కుటుంబంలో జన్మించారు. ఇజ్రాయెల్ ఫిలాహార్మోనిక్ ఆర్కెస్ట్రా (ఐపీఓ) కు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. లాస్ ఏంజెల్స్ ఫిల్‌హార్మోనిక్‌ను పర్యవేక్షించారు. రాయల్ లివర్‌పూర్ ఫిల్‌హార్మోనిక్‌ను నిర్వహించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. న్యూయార్క్ ఫిల్ హార్మోనిక్‌కు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. ఠాగూర్ అవార్డు, 2022లో ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, ఇతర గౌరవాలు అందుకున్నారు.

ఆంద్రీ అగస్సీ (పుట్టినరోజు)



ఆంద్రీ కిర్క్ అగస్సీ 1970 ఏప్రిల్ 29న జన్మించారు. అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారుడు. సింగిల్స్‌లో వరల్డ్ నెంబరు వన్‌గా పేరొందారు. 8సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించారు. 1996 ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్. నాలుగు రకాల గ్రాండ్‌స్లామ్ టోర్న మెంట్స్‌లో సత్తా చాటిన తొలి క్రీడాకారుడు. సహ క్రీడాకారిణి స్టెఫీగ్రాఫ్‌ను పెళ్లాడారు. 2006లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పి చారిటీ ఫౌండేషన్ ద్వారా సమాజ సేవలో కొనసాగుతున్నారు.

మానసిక, సామాజిక చైతన్యం పెరగాలి

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశంలో క్యాన్సర్ బాధితులు క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలలోనూ అవగాహన కల్పించేలా మానసిక సామాజిక చైతన్యం అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. క్యాన్సర్ చికిత్సలో సైకో ఆంకాలజీ విభాగం కీలకమన్నారు. హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (హెచ్‌సిజి), సెంటర్ ఆఫ్ సైకో ఆంకాలజి ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా చర్చాగోష్ఠి నిర్వహించాయి. క్యాన్సర్ బారిన పడినవారు త్వరగా కోలుకోవడానికి రోగితోపాటు వారి బంధుమిత్రులలో కూడా ధైర్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చర్చాగోష్ఠికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దినేశ్‌గుండూరావు అభిప్రాయపడ్డారు. ఇందుకు రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ శాఖతోపాటు పలు సంస్థలు సహకారం అందిస్తున్నాయన్నారు. మానసిక స్థైర్యంతోనే త్వరగా కోలుకోగలరన్నారు. ఈసందర్భంగా పలువురు నిపుణులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

రుణాలకు దరఖాస్తులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలకు ధరఖాస్తు చేసుకోవాలని ఈడీ సుబ్రహ్మణ్యం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మైనార్టీలు (ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులు) స్వయం ఉపాధి రుణాలకు ఏపీఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌లో దరఖాస్తు చేసుకునే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నంబరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తు దారుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయి ఉండాలన్నారు. వయస్సు 21 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, రూరల్ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు కలిగి ఉండాలన్నారు. జనరిక్ మెడిసిన్ సెక్టార్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు పై అర్హతలతోపాటు డీ ఫార్మసీ/బీ ఫార్మసీ/ఎంఫార్మసీ చేసి ఉండాలన్నారు. మే 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గురుకుల ప్రవేశాలకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతి (నూతన ప్రవేశం), 4 నుంచి 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులచే ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు సంబంధిత పాఠశాలల నందు మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

విద్యతోనే ఉన్నతస్థాయికి..



జంగమకోటెలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



మదనహళ్ళిలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రెండు చోట్ల పూర్వ విద్యార్థులచే గురువందన

శిడ్లఘట్ట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో మనం సంపాదించిన ఆస్తులు, అంతస్తులు, సంపద చివరివరకు ఉండవు అయితే గురుశిష్యుల బంధం, గురువులనుంచి నేర్చుకున్న విద్యమాత్రం శాశ్వతంగా ఉంటుందని టీచర్ హెచ్‌ఎన్ నాగరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని జంగమకోటె ప్రభుత్వ హైస్కూల్‌లో 1988-89 బ్యాచ్ ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులు 36 సంవత్సరాల తర్వాత సమావేశమయ్యారు. స్థానిక చిక్కవీరమ్మపుట్టరుద్రప్ప కల్యాణమండపంలో ఏర్పాటైన కార్యక్రమంలో స్నేహమిలన, గురువందన కార్యక్రమంలో విద్యార్థులను ఆశీర్వదించి మాట్లాడారు. జీవితంలో గురి, పట్టుదల, గురువుల ఆశీర్వాదం ఉంటేనే విద్యకు సార్థకత లభిస్తుందన్నారు. విద్యతో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చుననిన్నారు. గురుశిష్యుల బంధం అమూల్యమైనదన్నారు. శిష్యులు విజయం సాధిస్తే గురువులకు లభించే సంతోషం చెప్పలేనిదన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ బాల్య స్నేహితులను చూసి సంబరపడ్డారు. పూర్వ విద్యార్థులంతా గురువులకు పాదాభివందనం చేశారు. ఉపాధ్యాయులు చిక్కప్పయ్య, ఎస్ చంద్రశేఖర్, ఏ రాజప్ప, నందీశ్, ఎస్‌వీ రాజగోపాల్, పూర్తి విద్యార్థి, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజణ్ణ, ఆంజనేయ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మదనహళ్ళి ప్రభుత్వ పాఠశాలలో...

చింతామణి: చింతామణి-కోలారు రోడ్డులోని కోలారు తాలూకా మదనహళ్ళి ప్రభుత్వ హైస్కూల్‌లో 1993-96 బ్యాచ్ ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులచే స్నేహమిలన, గురువందన కార్యక్రమం జరిగింది. రిటైర్డు టీచర్ ఆర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ మనం సంపాదించిన ఆస్తి, సంపద చివరి వరకు ఉండవని అయితే నేర్పిన విద్యమాత్రం ఉంటుందన్నారు. సాంకేతికంగా ముందంజలో ఉండడంతో ప్రస్తుతం ప్రపంచమే ఒక గ్రామంలా మారిందన్నారు. ఉద్యోగం, తదితర కారణాలతో సొంతూరు కాకుండా వేరే ప్రాంతంలో ఉంటూ తమ దైనందిన ఒత్తిడిలో స్వగ్రామం, కన్నవారు, అక్షరాలు నేర్పిన గురువులను గుర్తుంచుకునేవారు కరువయ్యారన్నారు. ఇలాంటి తరుణంలో పూర్వ విద్యార్థులంతా చేరి తమ జ్ఞాపకాలను పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల, గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని సూచిం చారు. ఉపాధ్యాయులు ఎస్‌ఎం రమేశ్, హల్లప్పగౌడ, అశ్వత్థనారాయణ, కేవీ రమేశ్, ఎంజీ కెంచప్ప, ఆర్‌ఎం పరమేశ్వరప్ప, ఎం సంపంగి, ఎం మునిరెడ్డి, కే వెంకటేశ్, సీవీ నారాయణస్వామిలను ఆత్మీయంగా సత్కరించారు. 120మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యక్రమానికి విచ్చేసిన గురువులను మేళతాళాలతో వేదికపైకి ఆహ్వానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

1 నుంచి లంచంపై పోరాటం

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర తాలూకాలో అవినీతికి అవకాశం లేకుండా చైతన్యం కల్పించేలా మే 1నుంచి 'లంచ ముక్త అభియాన' (లంచం లేకుండా చేయడం) అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్‌ఎస్) బెంగళూరు గ్రామీణ జిల్లా అధ్యక్షుడు బీ శివశంకర్ తెలిపారు. పట్టణంలోని కేఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలో అవినీతి తాండవమాడుతోందన్నారు. రెవెన్యూ శాఖ, నగరసభ, తాలూకా కార్యాలయం, తాలూకా పంచాయతీ కార్యాలయం సహా అన్ని కార్యాలయాలను సందర్శించి ప్రజల సమస్యలపై నేరుగా స్పందించాలని అధికారులను కోరనున్నట్టు తెలిపారు. కొంతమంది ప్రభావవ్యక్తుల ఒత్తిడితో ప్రభుత్వస్థలాలు సైతం రిజిస్ట్రేషన్ అవుతున్నట్టు తెలుస్తోందన్నారు. ఇలాంటివాటికి అవకాశం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలను చైతన్యం చేయదలిచామన్నారు. ప్రజలలో అవగాహన పెరగాలని, అవినీతికి పాల్పడే అధికారులను ప్రశ్నించాలన్నారు. మీడియా సమావేశంలో కేఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు మారుతి, తాలూకా ప్రధాన కార్యదర్శి మురారి, బీఎల్ రామ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రంజితా తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక రాష్ట్ర సమితి గ్రామీణ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ తదితరులు

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



ట్రోఫీతో విజేత జట్టు

దేవనహళ్ళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. కెంపేగౌడ యువజన బళగ ఆధ్వర్యంలో నాల్గో వార్షిక క్రికెట్ ప్రీమియర్ లీగ్ శని, ఆదివారాలలో రెండు రోజులపాటు సాగింది. టోర్నీ విజేతగా మహేశ్ కేప్టెన్సీలోని రణభైరేగౌడ జట్టు ట్రోఫీని గెలుపొందింది. మండిబెలె గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు కేశవ పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి ప్రదానం చేశారు. టోర్నీలో మహేశ్ నాయకత్వంలోని రణభైరేగౌడ జట్టు, మోహన్, కిరణ్ నేతృత్వంలోని బాలగంగాధరనాథ స్వామిజీ (బీజీఎస్) జట్టు, ఆర్‌ఆర్ నాయకత్వంలోని కెంగల్ హనుమంతయ్యజట్టు, కిరణ్ నాయకత్వంలోని ఓంకారేశ్వరస్వామి జట్టు, జీఎస్ మధు నాయకత్వంలోని గురప్పస్వామి జట్టు, కెంపేగౌడ జట్టు, కువెంపు జట్టు టోర్నీలో తలపడ్డాయి.

కులగణనలో మాదిగ మాత్రమే నమోదు చేయాలి

తాలూకా మాదిగ మహాసభ డిమాండ్



కరపత్రాలతో తాలూకా మాదిగ మహాసభ పదాధికారులు

దొమ్మసంద్ర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మే 5నుంచి 17 వరకు నిర్వహించే ఎస్సీ కులగణనలో మాదిగ సముదాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆది కర్ణాటక, ఆది ద్రావిడ, ఆది ఆంధ్ర అనే సూచనతో ప్రస్తావించరాని కేవలం మూల కులమైన 'మాదిగ అని మాత్రమే రాయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆనేకల్ తాలూకా మాదిగ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర, నెరిగా, కూగురు, కామనహళ్ళి, దొమ్మసంద్ర తదితర గ్రామాలలో పర్యటించనున్నట్టు తెలిపారు. కులగణనకు వివరాలు సేకరించిన వేళ కాలం 61లో 'మాదిగ అని మాత్రమే రాసేలా కోరాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్సిల్‌తో రాయరాదని పెన్నుతో నమోదు చేసేలా చూడాలన్నారు.

కశ్మీర్ మృతులకు నివాళి

బాగేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందినవారికి పట్టణంలో నివాళులు అర్పించారు. పట్టణంలోని 22వ వార్డు కమర్ ఖమర్ మసీదు ముందు స్థానికులు చేరారు. మసీదు ధర్మగురువు రిజ్వాన్ అహ్మద్ మాట్లాడుతూ ఇస్లాం ప్రకారం వ్యక్తులను హతమార్చడం మానవజాతిని అంతమొందించడంతో సమానమన్నారు. కశ్మీర్‌లో చోటు చేసుకున్న ఘటన ఖండించదగినదన్నారు. ఉగ్రవాదుల దాడులలో అమాయకులు బలయ్యారని విచారం వ్యక్తం చేశారు. కుటుంబీకులను కోల్పోయినవారి రోదన కలచివేసిందన్నారు. జాతీయ పతాకాలు ప్రదర్శించి దేశంలో శాంతి నెలకొనాల్సి ఉందన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మసీదు కార్యదర్శి అదిల్‌ఖాన్, సుభాన్‌సాబ్, మౌలా అలి, మౌజిన్ ఇంతియాజ్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో మసీదు వద్ద నివాళులు అర్పిస్తున్న స్థానికులు



బంగారపేటలో కశ్మీర్ మృతులకు నివాళులు అర్పిస్తున్న స్థానికులు

పొలాలకు మార్గం కల్పించండి

బంగారపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని మల్లేశనపాళ్య ప్రజలు పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించే విషయంలో వారం రోజుల్లోగా అటవీశాఖ చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తామని మాజీ ఎంపీ ఎస్ మునిస్వామి హెచ్చరించారు. మల్లేశనపాళ్యలో సోమవారం గ్రామస్థుల సమస్యలను ఆలకించారు. దోణిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని మల్లేశనపాళ్యలో వాల్మీకి సామాజిక వర్గంవారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్న మార్గాన్ని నెలన్నర క్రితం అటవీశాఖ మూసివేసింది. దీంతో గ్రామస్థులు ఐదారు కిలోమీటర్లు చుట్టు తిరిగి పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలోని రోడ్డు వర్షం కురిస్తే జలమయమై సంచారానికి వీలుగా ఉండదు. రోజుల తరబడి దిగ్బంధన పరిస్థితి ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న ప్రదేశాన్ని అటవీశాఖభూమిగా పేర్కొంటూ ఇలా వ్యవహరించి పేదలను వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ అంశంపై అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రెతో ఫోన్‌లో సంప్రదించగా అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని మునిస్వామి తెలిపారు.



గ్రామస్థులతో మాజీ ఎంపీ మునిస్వామి

క్రికెట్ బెట్టింగ్.. ఇద్దరి అరెస్టు

ముళబాగిలు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ముళబాగిలు పట్టణ శివారులోని లింగాపుర గ్రామ గేట్ సమీపాన బస్టాప్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న నూగలబండె రహమత్‌నగర్‌కు చెందిన సుహేల్‌ఖాన్, ఇర్ఫాన్‌లను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. టి-20 ఐపీఎల్ క్రికెట్ పోటీలో ముంబై ఇండియన్స్, లఖ్‌నవ్ సూపర్ జెయింట్స్ మధ్య బెట్టింగ్ చేసినట్టు గుర్తించామని ముళబాగిలు రూరల్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌గౌడ పాటిల్ తెలిపారు. నిందితుల నుంచి రూ.2300 నగదు, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సిబ్బంది కార్యాచరణపై ఎస్పీ ప్రశంసలు వ్యక్తం చేసినట్టు సీఐ తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

ఉత్సాహంగా 'కన్నడ సంభ్రమ'



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

చింతామణి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆలంబగిరిపై ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సిరిగన్నడ వేదిక చింతామణిశాఖ ఆధ్వర్యంలో కన్నడ సంభ్రమ పేరిట గ్రామీణ పాఠశాల విద్యార్థులకు వేసవి శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కన్నడ గీతాల గాయనం, కవుల పరిచయం, చిత్రకళా పోటీలు నిర్వహించారు. కన్నడ మాత భువనేశ్వరి చిత్రపటానికి చింతామణి ప్రభుత్వ హైస్కూల్ టీచర్ సరస్వతి పుష్పాంజలి ఘటించారు. సిరిగన్నడ వేదిక ఆధ్వర్యంలో అర్థపూర్ణంగా కార్యక్రమాలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాథ్ ఎస్‌ఎన్ మాట్లాడుతూ తాలూకాలోని పాఠశాలల్లో కన్నడ వాతావరణం పెంపొందించేందుకు, భాషా వికాసానికి కన్నడ సంఘాలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పిల్లల్లో సృజనశీలత పెంచేందుకు, దాగియున్న శక్తిని వెలికితీసేందుకు సహకరిస్తాయన్నారు. పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వివిధ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో సిరిగన్నడ వేదిక, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు టీసీ లక్ష్మీపతి, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు మంజునాథ్, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు రెడ్డి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పైల్స్ నియంత్రణకు ప్రత్యేక పరీక్షా శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామలింగప్ప తదితరులు

బాగేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పైల్స్ సమస్యతో బాధపడేవారికి ప్రత్యేకంగా వైద్య పరీక్షా శిబిరాన్ని పట్టణంలోని వికాస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేశారు. పైల్స్ (మూలశంక), ఫిషర్, ఫిస్టులా తదితరవాటికి పరీక్షలు చేశారు. 180మందికిపైగా పాల్గొని శిబిరం ప్రయోజనాలు పొందారు. బాగేపల్లి, చేళూరు, గుడిబండ తాలూకాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. బెంగళూరు స్మైల్స్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని పరీక్షలు చేశారు. స్వర్ణభూమి ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షులు రామలింగప్ప ఉచిత శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ బాగేపల్లి నియోజకవర్గంలోని తాలూకా కేంద్రాలలో రానున్న రోజుల్లో ఉచిత పైల్స్ పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. స్మైల్స్ ఆసుపత్రి ముఖ్యులు డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ సగటున 75శాతం ప్రజలు పైల్స్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జంక్ ఫుడ్ తినడం, తగినంత నీరు తాగకపోవడం వలన మలబద్ధకం, మలవిసర్జనకు ఇబ్బందులు, మలంలో రక్తం పడడం వంటివి ఎదుర్కొంటారన్నారు. పైల్స్ సమస్యలకు రక్తస్రావం లేకుండా లేజర్ చికిత్స ద్వారా నయం చేయవచ్చునన్నారు. శిబిరంలో వికాస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివణ్ణ, ఆసుపత్రి సంచాలకులు రమేశ్, మహదేవ్, అధ్యాపకులు హనుమేశ్, సంజయ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌ను తుడిచిపెట్టాలి

టీడీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రావిమోహన్ చౌదరి

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ యాత్రకు వెళ్లిన పర్యాటకులను కిరాతకంగా హతమార్చిన ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచపటంలో లేకుండా తుడిచి పెట్టాలని రాష్ట్ర టీడీపీ కో-ఆర్డినేటర్ రావిమోహన్ చౌదరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ విదేశీ టూరిస్టులను గుర్తించి మరీ చంపడం కిరాతకానికి నిదర్శనమన్నారు. ఉగ్రవాదాన్ని దశాబ్దాలకాలంగా పెంచి పోషించేలా వ్యవహరిస్తున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకునే చర్యలకు జాతి యావత్తు సంపూర్ణంగా ఉంటుందన్నారు. ప్రధానమంత్రి నిర్ణయానికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారన్నారు. 26మంది మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తు న్నట్టు రావిమోహన్‌చౌదరి పేర్కొన్నారు.

శ్రీకృష్ణ గ్రూప్ సంస్థల వైస్ చైర్మన్ జలజ కన్నుమూత

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కత్రిగుప్పెలోని శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ రుక్మాంగదనాయుడు సతీమణి, వైస్ చైర్మన్ జలజ (74) కన్నుమూశారు. ఇటీవల కొన్ని రోజులుగా అస్వస్థతతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండేవారు. సోమవారం తెల్లవారుజామున జలజ కన్నుమూశారు. ఆమె పార్థివదేహాన్ని విద్యాపీఠ సర్కిల్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. అభిమానులు, బంధుమిత్రుల సందర్శనకు ఉంచారు. రాష్ట్ర ప్రతిపక్షనేత ఆర్ అశోక్, ఎమ్మెల్యేలు రవిసుబ్రమణ్య, మునిరత్న, మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు, బీజేపీ నేత కట్టా జగదీశ్, ఆర్‌వీ హరీశ్, గుర్రప్పనాయుడు, కమ్మవారి సంఘం ప్రతినిధుల తోపాటు పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. రుక్మాంగద నాయుడును పలువురు ఓదార్చారు. సాయంత్రం బనశంకరిలోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.30	1,578.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	447	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	332	260
నీటి నిల్వ (టీఎంసీలు)	6.88	3.70

ఉపాధి కూలీల నిరసన

కంప్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పనులకు తగిన కూలి చెల్లించడం లేని ఉపాధికూలీలు మండిపడ్డారు. సోమవారం సండూంరు పరిధిలోని కొత్త దరోజీ గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు శాంతమ్మ, లక్ష్మీ, బసమ్మ, సుంకరాజు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6.40 గంటలకు పనుల వద్దకు చేరుకుని తిరిగి 11.40కు అధికారులు మేటి ఇచ్చిన కొలతల ప్రకారమే పనులు చేస్తున్నామన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రూ.370 కూలి బదులుగా కేవలం రూ.70 మాత్రమే తమ ఖాతాలో జమచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసేచోట తాగునీరు తదితర కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. హనుమంతు మలన్‌బి, అభి, గోవిందు, మంజలి, మారేష్, యూనిస్, రాజా పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

ఉచిత ఆరోగ్య కేంద్రం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలో బెంగళూరు వైదేహి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య కేంద్రం సోమవారం ఏర్పాటు చేశారు. కప్పగల్లు రోడ్డు 22వ వార్డులో బళ్లారి మహానగరపాలిక కార్పొరేటర్ హనుమంతప్ప నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు ప్రారంభించారు. ఈ ఆరోగ్య కేంద్రంలో దాదాపుగా 150 మంది వరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రముఖులు రామచంద్రప్ప, మళ్లీ గడ్డం తిమ్మప్ప నాగవేణి మహిళా మోర్చ అధ్యక్షురాలు సుమారెడ్డి, శ్రీధర్ శెట్టి, బెంగళూరు వైద్య ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిశివయోగుల మహారథోత్సవం

సిరుగుప్ప, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మరిశివయోగి మహారథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని హాళేకోట గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయం నుంచి ఎదురుబసవన్న వరకు గ్రామపురవీధుల్లో రథాన్ని ఊరేగించారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వాములకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి నిర్వహించారు.

నాటక రంగానికి పుట్టినిల్లు బళ్లారి

● రంగాయణ డైరెక్టర్ డాక్టర్ సుజాత జంగమశెట్టి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా నాటక రంగానికి పుట్టినిల్లు అని కలబురగి రంగాయణ డైరెక్టర్ డాక్టర్ సుజాత జంగమశెట్టి అన్నారు. సోమవారం నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు కల్చరల్ కాంప్లెక్స్‌లోని హాల్లో ఏర్పాటు చేసిన నాటక కళాకారులతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలబురగి రంగాయణ కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని మొత్తం ఏడు జిల్లాలకు సరిహద్దుగా ఉందన్నారు. కళారంగానికి ఈ సంస్థ కృషి చేస్తోందన్నారు. బళ్లారి జిల్లాలో జోళదరాశి దొడ్డనగౌడ , రాఘవ, బెళగల్లు వీరణ్ణ, సుభద్రమ్మ మన్సూర్ సహా ఎందరో ప్రముఖులు ఎనలేని సేవలందించారన్నారు. ఈప్రాంతంలోని బయలాట, దొడ్డాట, తొలుబొమ్మలాట వంటి కళలను రక్షించుకోవాలన్నారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత జంగమశెట్టి

విద్వేషాలు రేపడం గర్హనీయం

● మాన్వి కల్మఠ మఠాధిపతి ఆవేదన

రాయచూరు ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య విద్వేషాలను రేపడంతోపాటు వారిని విడదీసే ప్రయత్నం ప్రభుత్వాలే చేస్తుండడం గర్హనీయమం, విచారకరమని మాన్వి కల్మఠ మఠాధిపతి విరుపాక్ష పీఠాధిపతి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి ప్రయత్నం చేసిన సందర్భంగా ప్రభుత్వానికి తగిన గుణపాఠం ఎదురైనా ఇప్పటికి బుద్ధి రాకపోవడం విచారకరమని ఒకింతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం శాంతరాజు, జయప్రకాశ్ హెగ్డెల నివేదికలను శిఫార్సులను ఆమోదించవద్దని వీరశైవ లింగాయత్ తరఫున డిమాండ్ చేశారు. శాంతరాజు, జయప్రకాశ్ హెగ్డెల నివేదికల అమలు పై ప్రభుత్వం చూపుతున్న ఉత్సహాన్ని వ్యతిరేకిస్తు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని జగద్గురు రేణుకాచార్య విగ్రహం వద్ద నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన వీరశైవ సమాజం ప్రముఖులు హర్షితా గార్డన్ వద్ద సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నివేదికలో శాంతరాజు, జయప్రకాశ్ హెగ్డెల నివేదికలో లోపాలున్నట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తినా వాటిని గుడ్డిగా అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



సింధిగేరిలో అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడు తాలుకాలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను సోమవారం అధికారులు పరిశీలించారు. పలు ప్రాంతాల్లో కూలిపోయిన అరటి పంటను వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. తాలుకా పరిధిలోని సోమలాపురం, వన్నెళ్లి, మానెళ్లి, సుగ్గునళ్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ, కంప్లి వ్యవసాయ శాఖాధికారి సోమశేఖర్ పరిశీలించారు. కురుగోడు తాలుకా పరిధిలోని సింధిగేరి దమ్మూరు గ్రామాల్లో నష్టపోయిన అరటి పంటలను ఉద్యానశాఖాధి కారులు రాఘవేంద్ర శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నష్టపోయిన పంటలను పరిశీలించామని, ప్రభుత్వానికి నివేదిక పంపి పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాగన్నగౌడ, నాగయ్య, జమ్మన్న పాల్గొన్నారు.



సోమలాపురం వద్ద..

పహల్గాం దాడిపై అంజుమన్ కమిటీ నిరసన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను చంపడాన్ని వ్యతిరేకిస్తూ అంజుమన్ ఖిద్మత్ ఇస్లాం కమిటీ నిరసన చేపట్టింది. సోమవారం హొసపేట అంబేడ్కర్ సర్కిల్లో నిరసన చేపట్టిన వారు అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. ఈసందర్భంగా అంజుమన్ ఖిద్మాత్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇమామ్ నియాజీ మాట్లాడుతూ కొన్ని మీడియా సంస్థలు మత విద్వేషాలు రెచ్చగొట్టడం సరి కాదన్నారు. ఉగ్రవాదులకు కులం, మతం వర్గం వివక్ష ఉండదని, ఇలాంటి వారికి కఠిన శిక్షలు విధించాలన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా యూనిట్ అధ్యక్షుడు దాదాపీర్, అంజుమన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఫైరోజ్‌ఖాన్, కార్యదర్శి అబూబక్కర్ ఆష్రాఫీ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ మైనుద్దీన్,సభ్యులు గులాం రసూల్, ఖాదర్ రఫాయి, నజీమ్, ఫజులుల్లా, రెమహత్ పాల్గొన్నారు.



నిరసనలో అంజుమన్ కమిటీ సభ్యులు

500 మంది కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు సీఆర్ హనుమంతు ఆధ్వర్యంలో 500 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. సంగాత్రేయ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమవారం వారికి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మెచ్చి బీజేపీలో నుంచి కాంగ్రెస్ లోకి చేరుతున్నట్లు తెలిపారు. హనుమంతు అభిమానులు బీజేపీ నుంచి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినందుకు హర్షణీయమన్నారు. అనంతరం ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు బట్ట ప్రసాదు, ఉస్మాన్, నారాయణప్ప, బసవరాజు, హబీబుర్ రెహమాన్, సిద్దప్ప, జాఫర్, స్వామి, గోపాల్, మాయప్ప, వెంకోబ తదితరులు పాల్గొన్నారు.

పునీత్ రాజ్‌కుమార్ పునర్జన్మ ఎత్తాలి



పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పావగడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పునీత్‌రాజ్‌కుమార్ పునర్జన్మ ఎత్తాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని చెళ్లికెర క్రాస్‌లో పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌ను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. చేసిన సాయం, ఇచ్చిన దానం ఎప్పటికీ మన చేయి వీడదని నమ్మకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద విద్యార్థులకు కనిపించకుండా పునీత్ రాజ్‌కుమార్ చేసిన దానం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కొనియాడారు. ఆయన పేరుతో మరిన్ని సేవలు చేయడానికి తాను ముందుంటానన్నారు. ఈడిగకులస్థులు అంజేగౌడ, నామినేటెడ్ మునిసిపల్ కౌన్సిలర్ గంగాధర్, కౌన్సిలర్లు సురేష్, బాబు, గీత, హనుమంతరావు, ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు వీరాంజనేయ, కార్యదర్శి మల్లసంద్ర శివన్న, సభ్యులు రామచంద్రప్ప పాల్గొన్నారు.

ధాన్యం ధరలు తగ్గడంతో ఆందోళన

సిరుగుప్ప, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వరిధాన్యం ధరలు తగ్గడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఈ యేడాది పుష్కలంగా వర్షాలు పడిన కారణంగా రెండు పంటలను రైతులు పండించారు. ఖరీఫ్ సీజన్‌లో అనుకున్న విధంగా వరికి మద్దతు ధర వుండేది. రబీ సీజన్‌లో రూ. 1500లకు ధర పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 50 నుండి 60 బస్తాలు పండించారు. పంట మాత్రం అధిక దిగుబడి వచ్చింది. ధరలు లేకపోవడంతో రోడ్డుపక్కనే రాశులు, రాశులుగా వరిధాన్యాన్ని నిల్వ చేశారు. తక్షణమే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

● జనివార సముదాయ ప్రముఖుడు డీవీ సుబ్బారావు

కంప్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హిందూ మతానికి చెందిన ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుందామని జనివార సముదాయ ప్రముఖులు డీవీ సుబ్బారావు తెలిపారు. సోమవారం కంప్లి పట్టణంలో జనివార సముదాయం ఆధ్వర్యంలో ఉద్భవ గణపతి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు జమ్ముకశ్మీర్‌లో ఈ నెల 22వ తేదీన జరిగిన పాకిస్తాన్ ఉగ్రవాదులు హిందువులపై నరమేధ హత్య ఖండించి ర్యాలీ నిర్వహించారు. బీదర్‌లో జరిగిన సెట్ పరీక్షల్లో కూడా ధర్మాన్ని మరచిపోయారన్నారు. విద్యార్థులు ధరించిన జంధ్యం తొలగిచడం సరికాదన్నారు. దేశంలో ప్రతి హిందూ ఐక్యత ముందుకు రావాలన్నారు. అనంతరం గ్రేడ్2 తహసీల్దార్ షణ్ముఖప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపికృష్ణన్, మారుతి, చిత్రగార్, రుద్రప్ప, జగదేష్ విశ్వనాథ్ ఇంద్రజిత్, బ్రహ్మయ్య, మౌనేష్, గణేష్, రామరాజు నాగరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న హిందూ సంఘ నాయకులు డీవీ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్

బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించాలి

● ముందస్తు సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాయంత్రాంగం, కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మే 12న జిల్లా కేంద్రంలో బుద్ధజయంతిని ఘనంగా జరుపుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రమోద్ అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలో బుద్ధ జయంతి వేడుకలపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి సంవత్సరంలాగే, ఈ సంవత్సరం కూడా రాష్ట్రప్రభుత్వం బుద్ధ జయంతి నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించిందన్నారు. మే 12న సాయంత్రం నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో వేడుకలను నిర్వహించాలన్నారు. వేదిక శుభ్రత, తాగునీటి, ఇతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. సాయంత్రం నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి ఊరేగింపు నిర్వహించాలన్నారు. మున్సిపల్ కాలేజీ గ్రౌండ్స్, గడిగ చెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డు బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా జైన్ మార్కెట్ రోడ్డు, గవియప్ప సర్కిల్‌నుంచి జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిర వేదిక వద్దకు ర్యాలీ చేరుతుందన్నారు. బుద్ధ గాన కార్యక్రమం చేపడ్తామన్నారు. నేటి తరానికి గొప్ప వ్యక్తుల భావజాలాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందనీ, ఈవిషయంలో నైపుణ్యం కలిగిన లెక్చరర్లతో ప్రత్యేక ఉపన్యాసాలు ఇప్పించాలన్నారు. విజయోత్సవ ఊరేగింపులో వివిధ సాంస్కృతిక బృందాలు పాల్గొంటాయి. జయంతి కార్యక్రమాల్లో జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లాలో బుద్ధవిహార ధ్యానకేంద్రాన్ని ప్రారంభించాలని వివిధ సంస్థల ఆఫీస్ బేరర్లు సమావేశంలో ప్రతిపాదించారు. ఈసందర్భంలో కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, వివిధ సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

చదరంగం పోటీలతో పిల్లల్లో మేధోవికాసం

● యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): చెస్, క్యారమ్స్ ఆటలు పిల్లల్లో మేధో వికాసానికి దోహద పడతాయని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. సోమ వారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థుల కోసం నిర్వహించిన ఇండోర్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదరంగం, క్యారమ్ ఆటలు రెండూ భారతదేశంలోనే మొదలు కావడం హర్షణీయమన్నారు. ఈ ఆటలు రాజులు, చక్రవర్తుల కాలం నుండబి వాడుకలో ఉన్నాని, ఇవి అంతర్జాతీయ గుర్తింపు పొందాయన్నారు. విద్యార్థులు వంశీ, కీర్తన, మేఘమాల, శ్రీవచన, సులోచన, లక్ష్మణ్, వసంత్‌కుమార్, మందార, సుచిత్ర, హేమావతి, యశ్వంత్, మేఘన. నందిని, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సామూహిక వివాహాల్లో ఒక్కటైన 16 జంటలు

సిరుగుప్ప, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉచిత సామూహిక వివాహాల్లో 16 జంటలు ఏకమయ్యారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బసవభూషణ స్వాములు మాట్లాడుతూ సామూహిక వివాహాలు పేదలకు ఎంతో ఉపయోగకరమన్నారు. తాలుకాలోని నాగరాళ గ్రామంలో పెన్నయ్య, బసవమ్మ పురాణ పఠన మహనీయుల పురాణ పఠన కార్యక్రమం జరిగింది. వధూవరులకు బసవభూషణ స్వాములు తాలిబొట్లు అందజేశారు. ఈ సందర్భంగా బసవయ్య స్వాములునామా జగదీశయ్య, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

హరిహరులను దర్శించుకుని..!



కంటైనర్ డ్రైవర్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి/పాకాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన నలుగురు మహిళలు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరులోని జీఆర్‌బీ ఫుడ్ ప్రొడెక్ట్‌లో పనిచేస్తున్నారు. వీరు శనివారం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో పాకాల సమీపంలోని తోటపల్లి వద్ద జార్ఖండ్ రాష్ట్రం రాంచీ నుంచి బెంగళూరుకు కొరియర్ లోడ్‌తో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక వైపు బలంగా ఢీకొన్నారు. దీంతో కారు కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఏదో యాక్సిడెంట్ జరిగిందని గ్రహించిన లారీ డ్రైవర్ ఎన్‌హెచ్‌కు ఓవైపున లారీ నిలిపారు. అప్పటికే సుమారు 80 మీటర్లు కంటైనర్ ప్రయాణం చేసింది. ఇంతలో స్థానికులు, అటువైపు వెళ్లేవారు అప్రమత్తమై పోలీసులకు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అప్పటికే ఘోరం జరిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ కింద చిక్కుకున్న కారు నుజ్జునుజ్జుగా మారింది. అతికష్టం మీద బయటకు తీశారు. ఈఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయినవారి కొందరి ముఖాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. జాతీయ రహదారుల కోసం వినియోగించే క్రేన్ తీసుకొచ్చి అతికష్టం మీద కంటైనర్ నుంచి కారును వేరుచేశారు. గాయపడినవారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. భీతావహంగా మారిన ఘోర ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. కంటైనర్ డ్రైవరుతో మాట్లాడారు. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలుసుకున్నారు. కలెక్టర్ స్విమ్స్‌కు వెళ్లి క్షతగాత్రులకు వైద్య సేవలను పరిశీలించారు.

మృతులు: బెంగళూరుకు చెందిన విజయలక్ష్మి (50), సహన (34), రజని (27), లేఖన్ గౌడ (10), తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన కారు డ్రైవరు ఎస్.త్యాగరాజన్ (42). వీరిలో విజయలక్ష్మి, రజని, లేఖన గౌడ్ ఒకే కుటుంబానికి చెందిన వారు. తీవ్రంగా గాయపడింది: గీతమ్మ (51), క్రిస్‌విల్ (15). వీరిలో క్రిస్‌విల్ తండ్రి త్యాగరాజన్ మృతిచెందారు.



ప్రమాద స్థలంలో మృతదేహాలు

హోసూరు జోన్

గుట్కా, మద్యం బాటిళ్లు స్వాధీనం

హోసూరు (క్రైం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి మధురైకు వెళ్తున్న ప్రైవేట్ ఓమ్ని బస్సులో సుమారు 123 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత గుట్కాను తరలిస్తున్నట్టు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సిప్‌కాట్ జంక్షన్‌లో సిప్‌కాట్ ఎస్సై చిరంజీవికుమార్ నేతృత్వంలో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తున్న వేళ గుట్కాను గుర్తించారు. గుట్కాను స్వాధీనం చేసుకుని సేలం జిల్లా మెట్టూరు తాలూకా మల్లిగుండం ప్రాంతానికి చెందిన గుణశేఖరన్ (40)ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాగా ఉద్దనపల్లి పరిధిలో హోసూరు రోడ్డులోని కొత్త ఫ్లై ఓవర్ ప్రాంతంలో తనిఖీల వేళ లగ్జరీ కారును ఆపారు. పోలీసులను చూడగానే కారును కొద్దిదూరంలో ఆపి డ్రైవర్ పరారయ్యాడు. కారును సోదా చేయగా భారీ ప్రమాణంలో గుట్కా, మద్యం బాటిళ్లను గుర్తించారు. బెంగళూరు నుంచి సేలంకు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలుగా అంచనా వేశారు. కారును, గుట్కా, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు

ఎండిపోతున్న రామనాయకన్ చెరువు

హోసూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎండల ప్రభావానికి హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రామనాయకన్ చెరువు ఎండిపోతోంది. ఓవైపు నీరు అడగంటగా మరోవైపు గుర్రపుడెక్క నిండింది. చెరువులో నీరు అడుగంటి ప్రదేశంలో గడ్డి మొలకెత్తడంతో మేకలు మేపుతున్నారు. ఒకప్పుడు తాగేందుకు ఆధారంగా ఉన్న రామనాయకన్ చెరువు నేడు కలుషితంగా మారిపోయింది. చుట్టుపక్కల ఉన్న నివాసాలు, ఫ్యాక్టరీలు ఇతరత్రా నుంచి వ్యర్థాలు చేరుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. చెరువు చుట్టూ కంచె వేసి చెరువును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువుల సంరక్షణలో కార్పొరేషన్ నిర్లక్ష్యం చేస్తే రానున్న నాలుగైదేళ్లలో ఉన్న చెరువులు కాస్త కనుమరుగు కానున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దిశగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.



చెరువులో నీరు అడుగంటడంతో గొర్రెలను మేపుతున్న కాపర్లు